సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 30 । జూన్ । 2025



'అల'కల్లోలం..!
సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న గంగపుత్రులకు ప్రతికూల వాతావరణంతో వేట సాగక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో



బియ్యం దొంగలకు భరోసా..!
బొండపల్లి మండలంలో పెద్దపెత్తున పీడీఎస్ బియ్యం పట్టివేత సంఘటన జరిగి 24 రోజులవుతున్నా చర్యలు శూన్యం.
- 8లో



గిరిజన రైతు విలవిల..!
ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. పంటలు పండించడానికి పెట్టుబడులు ఎలా అని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

నేడు పీజీఆర్ఎస్ సమావేశం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధికారులు నిర్వహించనున్నారు. గిరిజనులు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి



మాట్లాడుతున్న రాహుల్ ఖురానా

సీతంపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే పీవీటీజీ గిరిజనుల అభివృద్ధి సాధ్యమని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రాహుల్ ఖురానా అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం డీఏ జుగా, పీఎం జన్‌మన్ పథకాల అమలు తీరును పరిశీలించడానికి సీతంపేట ఏజెన్సీలో రెండో రోజు ఆదివారం మొగదార కాలనీ, డి.బుడగరాయి, చిన్నరామ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకాల ద్వారా నిరుపేద ఆదిమ గిరిజనులకు గృహాలు మంజూరు చేశామన్నారు. గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించి అన్ని విధాల అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. వీటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ భవనాలు లేని చోట కొత్తవి నిర్మించనున్నారని ప్రభుత్వ స్థలం లేకపోతే అవసరమైన ప్రైవేటు స్థలం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలు విన్నారు. అంగన్‌వాడీ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేష్, సీడీపీవో సిమ్మాలమ్మ, పీవీటీజీ కో ఆర్డినేటర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరాహ, నరసింహమూర్తి అవతారాల్లో జగన్నాథుడు



వరాహ, నరసింహమూర్తి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా కోళ్ల బజారులో కొలువైన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి ఆదివారం వరాహ, నరసింహమూర్తి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పి.నగేషాచార్యులు, వెంకటరమణాచార్యులు స్వామివారికి పూజాదికాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.

ఉపాధ్యాయ బదిలీల్లో... ఎంటీఎస్‌లకు అన్యాయం!

- క్లస్టర్ విధానంతో పాట్లు
- మండలాలను కేటాయించినా.. విధుల్లో చేర్చుకోని వైనం
- క్లస్టర్ పాఠశాలలకు నియామకం
- ఆందోళనలో ఎంటీఎస్‌లు
- ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదంటున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 475 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు



పార్వతీపురం టౌన్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల అనంతరం జిల్లాలో పలు పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని ఎంటీఎస్‌లతో సర్దుబాటు చేసేందుకు వారం రోజుల కిందట కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో తమకు తీరని అన్యాయం జరిగిందని మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 475మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 1998, 2008 డీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన వీరంతా మినిమమ్ టైమ్ స్కేల్ విధానంలో జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఎస్‌జీటీలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన రెగ్యులర్ బదిలీల అనంతరం సుదూర ప్రాంతాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతాలకు దూరంగా సుమారు 70–100 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బదిలీలపై ఎంటీఎస్ ఉపాధ్యాయులు వ్యతిరేకించినా ఫలితం లేకపోయింది. అరకొర జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తాము దూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమలో సుమారు 80శాతం మంది రెండు మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయాల్సిన వారే ఉన్నారని చెబుతున్నారు. మండలాలకు ఎంటీఎస్‌లను పంపినా.. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేవనే కారణంతో 50శాతం మందికి పైగా ఎంటీఎస్‌లను విధుల్లోకి తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

క్లస్టర్ విధానంతో పాట్లు

ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ విధానం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లస్టర్ విధానంలో ఎస్‌జీటీలతో కొన్ని ఉన్నత పాఠశాలలకు తాత్కాలికంగా భర్తీ చేశారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతుండంతో ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. కౌన్సెలింగ్ పూర్తయి వారం రోజులు గడుస్తున్నా.. పాఠశాలలు కేటాయించడం లేదని వాపోతున్నారు. విజయనగరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 475 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు ఇవే...

కేవలం రూ.32 వేలతో పని చేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులను పని చేస్తున్న మండలాల్లో సర్దుబాటు చేయలేదు. ప్రతీ మండలంలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఒక ఎంటీఎస్‌ను నియమించలేదు. ప్రభుత్వం చూపిస్తున్న ఖాళీలు నివాస ప్రాంతాలకు 200 కిలోమీటర్లు ఉన్నందున ప్రభుత్వం ఇచ్చే జీతం ప్రయాణ ఖర్చులకే సరిపోతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రస్తుత ఖాళీల్లో సర్దుబాటు చేయాల్సి వస్తే హెచ్ఆర్ఏ, డీఏ ఇచ్చి రెగ్యులరైజేషన్ చేయాలి. జిల్లా వ్యాప్తంగా ప్రతీ క్లస్టర్‌లో క్లస్టర్ వేకెన్సీలు సృష్టించి ఎంటీఎస్‌లకు సర్దుబాటు చేయడంలేదు. దివ్యాంగులుగా ఉన్న ఎంటీఎస్‌లకు వారు కోరుకున్న మండలంలో పని చేసేందుకు అవకాశం కల్పించడం లేదు. మున్సిపల్ పాఠశాలలో వేకెన్సీలను కూడా 15 నుంచి 20మంది విద్యార్థులున్న ప్రతీ పాఠశాలలో ఒక ఎంటీఎస్ ఉపాధ్యాయుడిని నియమించాలి.

పాఠశాలలు కేటాయించాలి

ఎంటీఎస్‌లకు పాఠశాలలు కేటాయించాలి. దివ్యాంగులుగా ఉన్న ఎంటీఎస్‌లకు వారు కోరుకున్న మండలంలో పని చేసేందుకు అవకాశం కల్పించడం లేదు. అరకొర జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తాము దూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం, అధికారులు పునరాలోచించాలి. కొమరాడ మండలంలో క్లస్టర్‌కు కేటాయించారు. కాని పాఠశాల కేటాయించలేదు.

– ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

వారం రోజులు గడుస్తున్నా...

కౌన్సెలింగ్ పూర్తయి వారం రోజులు గడుస్తున్నా పాఠశాల కేటాయించ లేదు. గతంలో పార్వతీపురం మండలంలో విధులు నిర్వహించా. ప్రస్తుతం గరుగుబిల్లి మండలం క్లస్టర్‌కు కేటాయించారు. కానీ పాఠశాలను కేటాయించ లేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని చెబుతున్నారు.

– ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

తాత్కాలికంగా భర్తీ చేశారు..

క్లస్టర్ విధానంలో ఎస్‌జీటీలను కొన్ని ఉన్నత పాఠశాలల్లో తాత్కాలికంగా భర్తీ చేశారు. ప్రతీ మండలంలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఒక ఎంటీఎస్‌ను నియమించలేదు. మండలాలు కేటాయించారు.. కానీ ఇప్పటి వరకు పాఠశాలలు కేటాయించలేదు. త్వరగా పాఠశాలలు కేటాయించాలి. ఆ దిశగా అధికారులు అడుగులు వేయాలి.

– ఎంటీఎస్ ఉపాధ్యాయుడు



పడిపోయిన పైనాపిల్ ధర

సీతంపేట మార్కెట్‌కు ఆదివారం భారీగా పైనాపిల్‌ను గిరిజనులు విక్రయించేందుకు తీసుకువచ్చారు. అయితే ఓ వైపు జోరున వర్షం.. మరోవైపు పడిపోయిన ధరతో ఏం చేయాలో గిరిజనులకు తెలియలేదు. చివరకు ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను మరింత తగ్గించి ఒక్కో పైనాపిల్‌ను రూ.7 నుంచి 10 మధ్య కొనుగోలు చేశారు. గిరిజనులు చేసేది లేక వారికే విక్రయించాల్సి వచ్చింది. గత వారం ఇదే పైనాపిల్‌ను రూ.10 నుంచి 15 వరకు కొనుగోలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల మోసాలకు నష్టాలు చవి చూస్తున్నామని వాపోయారు.

– సీతంపేట

సంగాంలో ఏనుగుల సంచారం

వంగర:సంగాంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. శనివారం అర్ధరాత్రి రేగిడి మండలం సరసనాపల్లి తోటల్లోంచి మద్దువలస వంతెన కింది భాగం మీదుగా సంగాం పంట పొలాల్లోకి ప్రవేశించాయి. మొక్కజొన్న, చెరకు, వరి పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఆదివారం రాత్రి వంగర నుంచి రాజాం వెళ్లే రోడ్డును ఆనుకొని సంగాం పంట పొలాల్లో తొమ్మిది ఏనుగులు తిష్ట వేశాయి. అటవీ శాఖ సిబ్బంది, ఎలిఫెంట్ టేకర్స్ వాటి వెంట ఉంటూ ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



పంట పొలాల్లో ఏనుగులు సంచారం

ఒకటి, ఆరో తరగతుల్లో ప్రవేశాలు పెరగాలి : కలెక్టర్



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి, ఆరో తరగతుల్లో ప్రవేశాలు పెరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 1, 6 తరగతుల్లో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయన్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విద్యార్థులు చేరేలా శ్రద్ధ కనబరచాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, వీఆర్‌వోల సహకారం తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రవేశాలన్ని ఈ డ్రైవ్ ద్వారా భర్తీ కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, షూస్, నోట్ బుక్స్ తదితర సామగ్రి కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా తల్లికి వందనం కింద రూ.15 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తోన్న సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు. ఇన్ని వసతులు, లబ్ధిని చేకూర్చే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ప్రతీ ఏటా పెరగాలని, ఆ దిశగా తల్లితండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో చేరే ప్రతి విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు (పెన్) కేటాయించాలని, ఆ నంబరు ఉంటేనే విద్యార్థి రిజిస్టర్ అయినట్లవుతుందని తెలిపారు. తద్వారా తల్లికి వందనం వర్తిస్తుందని, ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలని, లేకుంటే వాటికి దరఖాస్తు చేయించి పెన్ పొందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో జూలై 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ డా. టి.కనకదుర్గ, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సెప్టెంబర్ 13, 14 తేదీల్లో జేవీవీ రాష్ట్ర మహాసభలు



ఐక్య నినాదంతో జేవీవీ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించే 18వ జనవిజ్ఞాన వేదిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి కె.త్రిమూర్తులు పిలుపునిచ్చారు. స్థానిక ఏపీఎన్జీవో హోమ్‌లో ఆదివారం జరిగిన ఆహ్వాన సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. తెలుగు ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించి జీవించాలని గత 37 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక అవిరళ కృషి జరుపుతున్నదని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, వైద్యులు, ఉద్యోగులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, మహిళలు మధ్యతరగతి మేధావులు, వృత్తి నిపుణులు దాదాపు 30 వేలకు పైగా సభ్యులున్న అతి పెద్ద సైన్స్ ప్రచార సంస్థ జనవిజ్ఞాన వేదిక అని కొనియాడారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి అనారోగ్య పరిస్థితులు సంభవించినా సైన్స్‌కు సంబంధించి ఏ అంశం ముందుకొచ్చి చర్చనీయాంశంగా మారినా జేవీవీ కార్యకర్తలు ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘానికి చైర్మన్‌గా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణను సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కె.విజయగౌరి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం




మహల్‌నోబిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీవో బాలాజీ తదితరులు

విజయనగరం అర్బన్: గణాంక శాఖ పితామహులు ప్రొఫెసర్ పీసీ మహల్‌నోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా జరుపుకొనే జాతీయ గణాంక దినోత్సవం కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళికాధికా రి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి సీపీవో పి.బాలాజీ, సిబ్బంది పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీపీవో మాట్లాడుతూ ప్రణాళిక వ్యవస్థకు పితామహుడు జవహర్‌లాల్ నెహ్రూ అయితే భారత ప్రణాళిక పథకానికి పీసీమహలనోబిస్ నిర్దేశకుడిగా ప్రసిద్ధి చెందారని కొనియాడారు. గ్రామంలో భూమికి హద్దులు నిర్ధారించి అందులో సాగైన భూమి, సాగుకి పనికి రాని భూమి, దేవాలయాలు, చెరువులు, శ్మశానాలు, పల్లం భూమి, మెట్టు భూమి, సత్రాలు, పన్నులు వసూలు, వస్తువుల అమ్మకాలు, చారిటీ ద్వారా ఆదాయం వంటి విషయాలను సేకరణ ప్రక్రియ ప్రాధాన్యతను పాలకులకు తెలియజేశారని తెలి పారు. ఏడీ, ఉప గణాంకాధికారులు పాల్గొన్నారు.

బీమా భారం
రూ. 6.19 కోట్లు..!

- ఉచిత పంటల బీమా పథకానికి మంగళం
- పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాల్సిన పరిస్థితి
- వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వు పంటలకు బీమా వర్తింపు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లించింది



సాగులో ఉన్న మొక్కజొన్న పంట

విజయనగరం ఫోర్ట్: ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లు పూర్తయినా అన్నదాత సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20వేల పెట్టుబడి సాయం అందజేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా సాయం ఊసెత్తడం లేదు. మరోవైపు గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసింది. రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలి. లేదంటే విపత్తుల సమయంలో పంటలు కోల్పోయిన రైతులకు ఆర్థిక సాయం అందదు. జిల్లాలో సాగవుతున్న వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వు పంటల సాగు విస్తీర్ణం ప్రకారం చూస్తే రైతులపై రూ.6.19 కోట్ల భారం పడనుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు పెట్టుబడి సాయం అందే దారి కనిపించక, మరోవైపు బీమా చెల్లింపునకు చేతిలో డబ్బులు లేక ఆవేదన చెందుతున్నారు. రైతన్నపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని, తమ ఓట్లతోనే అధికారంలోకి వచ్చి ఇప్పుడు తమనే ఇబ్బందులకు గురిచేస్తోందంటూ మండిపడుతున్నారు.

ఖరీఫ్‌లో నాలుగు పంటలకు బీమా వర్తింపు...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నాలుగు పంటలకు పంటల బీమా పథకాన్ని వర్తింపజేశారు. నాలుగు పంటలకు కూడా పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించుకోవాల్సిందే. వరి పంటకు హెక్టారుకు రూ.500, నువ్వు పంటకు హెక్టారుకు రూ.162.50, మొక్కజొన్నకు హెక్టారుకు రూ.412, పత్తి పంటకు హెక్టారుకు రూ.4,807 చెల్లించాలి. ఈ లెక్కన జిల్లాలో ఆయా పంటల సాగువిస్తీర్ణం ప్రకారం రైతులు రూ.6.19కోట్ల బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

పంటల సాధారణ సాగు విస్తీర్ణం, బీమా ప్రీమియం ఇలా...

పంట రకం	విస్తీర్ణం (హెక్టార్లలో)	చెల్లించాల్సిన బీమా ప్రీమియం
వరి	91,214	రూ.4,56,07,000
మొక్కజొన్న	12,386	రూ.51,09,225
నువ్వు	5,585	రూ.9,07,562
పత్తి	2,142	రూ.1,02,96,594

ఐదేళ్లూ ఒక్క రూపాయి కట్టలేదు..

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం ఒక్క రూపాయి కూడా మేము చెల్లించలేదు. అంతా ప్రభుత్వమే చెల్లించేది. విపత్తుల సమయంలో పరిహారం అందేది. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వరి పంట సాగుకు సిద్ధమవుతున్నాను. అధికారులు పంట బీమా ప్రీమియం చెల్లించాలని చెబుతున్నారు. లేదంటే పరిహారం అందదంటున్నారు. ఇది రైతుకు ఆర్థిక భారమే. ప్రభుత్వమే స్పందించి ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి.

– రంధి దేముడు, రైతు పెదవేమలి గ్రామం

గతంలో ఉచిత పంటల బీమా

నాకు మూడు ఎకరాల మెట్టు భూమి ఉంది. అందులో అరటి తోట సాగు చేస్తున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నా తరఫున పంటల బీమా ప్రీమియం చెల్లించడం వల్ల తుఫాన్ సమయంలో పంట నష్టపోతే 50వేల పరిహారం అందింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం రైతులను కట్టుకోమంటోంది.

– గనివాడ సన్యాసినాయుడు, రైతు, పెదమధుపాద గ్రామం

రైతులే చెల్లించాలి

పంటల బీమా పథకానికి సంబంధించి బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలి. పంటల బీమా కడితే ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా వర్తిస్తుంది. లేదంటే ఆర్థిక సాయం అందే పరిస్థితి ఉండదు.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

రైతు సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రేగిడి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ పనులు ప్రారంభమైనప్పటికీ సాగునీటి కాలువలకు ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పంటపొలాలకు నీరందే పరిస్థితి కష్టమేనన్నారు. నాగావళి నది కుడి ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఖరీఫ్‌కు రైతులకు అవసరమైన వరి విత్తనాలను మంచి రకాలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాయన్న, ఆకులలోవకట్టగెడ్డ, రేగిడి, తునివాడ చానల్ పూర్తిగా కుచించుకు పోయినప్పటికీ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, కన్వీనర్ వావిలపల్లి జగన్మోహన్‌రావు, రాజాం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, వావిలపల్లి శశిభూషణరావు పాల్గొన్నారు.

గెడ్డలో పడి యువకుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

తెర్లాం: బహిర్భూమికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు గెడ్డలోపడి మృతి చెందాడు. తెర్లాం మండలంలోని నందబలగ పంచాయతీ పరిధి జనార్దనవలస గ్రామంలో ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. దీనికి సంబంధించి ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనార్దనవలస గ్రామానికి చెందిన గుల్లిపల్లి సత్యనారాయణ(31) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి కాలుజారి గెడ్డలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో నీటిలోపడి ఊపిరిడక మృతి చెందాడు. కొంతసేపటికి గ్రామానికి చెందిన మరో వ్యక్తి బహిర్భూమికి అక్కడికి వెళ్లగా గెడ్డలో వ్యక్తి పడిపోయి ఉండడాన్ని చూసి బయటకు తీశాడు. అయితే అప్పటికే సత్యనారాయణ మృతిచెంది ఉండడంతో గ్రామంలోకి వెళ్లి మృతుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేయగా వారంతా వచ్చి చూసి బావురుమన్నారు. మృతుడికి తండ్రి లక్ష్మణ, తల్లి వెంకటమ్మ ఉన్నారు. సత్యనారాయణ బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడని, ఆదివారం ఉదయం లేచి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి గెడ్డలోపడి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు భోరున విలపిస్తున్నారు. మృతదేహానికి కుటుంబసభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదుపై ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల కల్లోలం..!

• వేటకు అల్పపీడనం దెబ్బ
• ప్రతికూల వాతావరణంతో కొనసాగని చేపల వేట
• ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు



ప్రతికూల వాతావరణంతో పతివాడబర్రిపేటలో ఉధృతంగా వస్తున్న కెరటాలు



తీరానికే పరిమితమైన బోట్లు



వలలకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

పూసపాటిరేగ: సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న గంగపుత్రులకు ప్రతికూల వాతావరణంతో వేట సాగక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండు నెలలుగా వేట నిషేధం కారణంగా సముద్రంలో వేట నిలిపివేశారు. తీరా వేట ప్రారంభించిన నాటి నుంచి వాతావరణంలో మార్పులతో అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడం తదితర కారణాలతో కొంత సమయం వేట సాగలేదు. తాజాగా గత మూడురోజులుగా అల్పపీడనం కారణంగా కెరటాలు ఉధృతిగా రావడంతో చేపల వేటకు వెళ్లినా చేపలు వలకు చిక్కని పరిస్థితి నెలకొందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరంలో గాలులు వీయడం, అలలు ఎగిసి పడుతుండడంతో వేటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో 21 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. సంప్రదాయ బోట్లు, ఇంజిన్‌బోట్లు రెండు మండలాల్లో 1120 వరకు ఉన్నాయి. వాటిలో 885 బోట్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్టర్ అయి ఉన్నాయి. ఈ ఏడాది వేట నిషేధం తరువాత వేట ప్రారంభించినప్పటి నుంచి చేపలు వలకు చిక్కడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. నిషేధ సమయంలో కుటుంబాలు ఎలాగో నెట్టుకొచ్చినా మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా అలల ఉధృతి ఎక్కువై బోట్లు తీరానికే పరిమితమయ్యాయి. వేట లేకపోవడంతో వలలకు మరమ్మతులు చేసుకుంటున్నామని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. వేట నిషేధ సమయంలో భృతి మంజూరుకు నిబంధనల పేరిట చాలామంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా నిలిపివేశారు. గత ప్రభుత్వంలో వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి మత్స్యకార భరోసా మంజూరైంది. కానీ నేడు మత్స్యకారుల పరిస్థితి అయోమయంగా మారింది. గత ఏడాది కూడా మత్స్యకార భరోసా ఊసెత్తని సర్కారు నిబంధనల పేరిట ఈ ఏడాది చాలా మందికి కోత విధించింది. ఏడాదిలో సగం రోజులు ప్రకృతి వైపరీత్యాలు, మరి కొన్ని రోజులు తుఫాన్ హెచ్చరికలు, ప్రతి కూల వాతావరణంతో వేట సాగక ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యకార జీవనవిధానంలో మార్పులకు సర్కారు ప్రత్యామ్నాయం ఆలోచించి వేట లేని సమయంలో తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అరకొరగా మత్స్యసంపద



వేట నిషేధసమయం తరువాత వేటకు వెళ్లినా చేపలు వలకు చిక్కడం లేదు. ప్రతి ఏడాది నిషేధం తరువాత చేపల వేట చేస్తే మత్స్య సంపద సమృద్ధిగా దొరికేది. కానీ ఈ ఏడాది నిషేధం తరువాత చేపల వేట సాగడం లేదు. వేటకు వెళ్లినా డీజిల్‌ఖర్చు కూడా రాని పరిస్థితి నెలకొంది. అల్పపీడనం కారణంగా మూడురోజులుగా వేట సాగలేదు.

– సూరాడ కొర్లయ్య, పతివాడబర్రిపేట

ప్రతికూల వాతావరణంతో ఇబ్బందులు



సముద్రంలో అల్పపీడనం ప్రభావంతో ప్రతికూల వాతావరణం నెలకొని అలల ఉధృతి పెరిగింది. వాతావరణంలో మార్పుల కారణంగా వేట చేయలేని పరిస్థితి. వేట సాగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. వేటలేని సమయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచించి ఆదుకోవాలి.

– ఆకుల కాశీలు, పతివాడ బర్రిపేట

చెస్‌పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ

• అంతర్జాతీయ పోటీలకు 21 మంది ఎంపిక



జాతీయ దివ్యాంగుల చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో ముఖ్య అతిథులు



విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తున్న సిరిసహస్ర, బాబ్జీలు

విజయనగరం: 'సరిలేరు మాకెవ్వరు' అని నిరూపించారు దివ్యాంగ క్రీడాకారులు. మూడు రోజులుగా జిల్లా వేదికగా జరిగిన 5వ జాతీయ దివ్యాంగుల చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న దివ్యాంగులు తమ ప్రతిభ చాటిచెప్పారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో జరిగిన పోటీల్లో దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 106 మంది క్రీడాకారులు పాల్గొన్న విషయం విదితమే. శనివారం రాత్రి వరకు 9 రౌండ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతరం 9వ రౌండ్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన క్రీడాకారులను ఆయా విభాగాల వారీగా విజేతలుగా ప్రకటించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర, జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం కార్యదర్శి కేవీ.జ్వాలాముఖిలు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర మాట్లాడుతూ మానసిక మేధోసంపత్తికి చెస్ వంటి క్రీడాకారులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలను తమ జీవితంలో అంతర్భాగంగా చేసుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగ క్రీడాకారులు ప్రతిభా పాటవాలు చెప్పలేనివని, పోటీల్లో విజేతలుగా నిలిచిన వారితో పాటు పాల్గొన్న వారు విజేతలేనంటూ అభినందించారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహించిన దివ్యాంగుల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు మొత్తం 7 కేటగిరీల్లో నిర్వహించామని, ఆయా కేటగిరీల్లో మొదటి మూడు స్థానాలు దక్కించుకున్న వారిని త్వరలో గోవాలో జరగనున్న ప్రపంచస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రూ.2.30 లక్షల నగదు బహుమతులను అందజేశామని వివరించారు. కార్యక్రమంలో పలువురు చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, అర్బిటర్‌లు, క్రీడాకారులు, వారి తలిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ వలకు చిక్కి నగదు పోగొట్టుకున్న బాధితుడు



బాధితుడు బిల్లకుర్తి ఉపేంద్రకుమార్

పాలకొండ రూరల్: ఓవైపు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రజలు నేరగాళ్లు, హ్యాకర్ల బారిన పడుతున్నారు. తాజాగా పాలకొండ మండలం సింగన్నవలసకు చెందిన బిల్లకుర్తి ఉపేంద్రకుమార్‌కు సైబర్ వలకు చిక్కి నగదు పోగొట్టుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 28 న సమీప గ్రామ సచివాలయానికి చెందిన ఓ కార్యదర్శి నంబర్ నుంచి ఓ 'లింక్' మెసేజ్ ఉపేంద్రకుమార్ వచ్చింది. గతంలో వలంటీరుగా పనిచేసిన క్రమంలో బహుశా కార్యదర్శి నుంచి ఈ లింక్ వచ్చి ఉంటుందని భావించి ఆ లింక్ ఓపెన్ చేశాడు. ఇంతలో సెల్‌ఫోన్‌కు పలుమెసేజ్‌లు వరుసగా వస్తుండడంతో సెల్ స్విచ్ ఆఫ్ చేశాడు. అయితే అప్పటికే సెల్ హ్యాక్ కావడంతో స్నేహితులు, బంధువులకు పలు మెసేజ్‌లు వెళ్లాయి. తన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని ఆర్థిక సాయం చేయాలని ఈ మెసేజ్‌ల సారాంశంగా బాధితుడు తెలుసుకున్నాడు. ఇంతలో తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా ఇదే సెల్‌కు అనుసంధానం చేసి ఉండడంతో వరుసగా నగదు మాయం అవుతుండడం, సమాచారం సెల్‌ఫోన్‌కు మెజేజ్‌ల రూపంలో వస్తుండడంతో ఆందోళన చెందాడు. తన ప్రమేయం లేకున్నా రూ.56వేల పైచిలుకు నదగు పలు దఫాలుగా మాయం కావడంతో ఆదివారం స్థానిక పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశాడు.

మద్యం వద్దు.. తాగునీరు ముద్దు

• సారిపల్లిలో వినూత్న ప్రచారం
• మద్యపాన నిసేధంపై ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



మద్యపాన నిషేధం కోసం సారిపల్లిలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో మద్యం ఏరులై పారుతోంది. బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్కడ చూసినా మద్యం లభిస్తోంది కానీ తాగునీరు మాత్రం దొరకడం లేదని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకులకు కనువిప్పు కలిగేందుకు గ్రామస్తులు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ మజ్జి త్రివేణి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ పర్యటించి మద్యపాన నిషేధంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల పార్టీలకు అతీతంగా సమావేశం ఏర్పాటు చేశామని, ఆలయాల నిర్మాణంతో పాటు గ్రామాభివృద్ధికి పలు తీర్మానాలు చేశామన్నారు. పేదలను పీల్చిపిప్పి చేస్తున్న మద్యాన్ని గ్రామంలో అమ్మకూడదని హెచ్చరికలు కూడా జారీ చేశామన్నారు. అయినప్పటికీ కొందరు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిసేధమే లక్ష్యంగా కరపత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. తాగునీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మంజూరైన ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు కూటమి నాయకులు సహకరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థి మృతి



ఉదయరాజ్ (ఫైల్)

బొబ్బిలి: బాడంగి మండలం హరిజన పాల్తేరుకు చెందిన అలమండ ఉదయ రాజ్(16) అనే ఇంటర్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో ఆదివారం దుర్మరణం చెందాడు. బాడంగి మండలానికి చెందిన అలమండ రవి బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తూ బొబ్బిలిలోనే స్థిరపడ్డాడు. రవికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఉదయరాజ్ విశాఖలోని శశి కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ఉదయరాజ్ పాత బొబ్బిలిలోని తన స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి బైక్‌పై వెళ్లాడు. స్నేహితుడితో మాట్లాడి తిరిగి రాతిపనివారి వీధిలోని తన ఇంటికి వస్తుండగా పాత బొబ్బిలిలో ఉన్న గుంతల వద్ద అదుపు తప్పి కిందపడిపోవడంతో లారీ ఢీకొంది. దీంతో ఉదయ రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ప్రేమ్‌కుమార్ 8వ తరగతి చదువుతున్నాడు. తల్లి ఉష భర్తకు చేదోడు వాదోడుగా షాపు దగ్గర ఉంటోంది. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్సై పి జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించారు.

చోరీ కేసులో రెండవ నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో డబ్బుల అపహరణ కేసులో రెండవ నిందితుడ్ని ఆదివారం అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ చెప్పారు. ఆ కేసులో బాధితుడు కర్రి రవీంద్ర రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, దర్యాప్తు పూర్తి చేశారు. ఆ కేసులో గుత్తి ప్రవీణ్ కుమార్, ఆర్.జయ ప్రకాష్ రెడ్డి, మహమ్మద్ అమీనుద్దీన్, చెల్లి రాజు, బూర రత్నాజీ, విశ్వనాథ్ రెడ్డి సంగీత కన్నన్‌లను ఇదివరకే అరెస్ట్ చేశారు. ఈ కేసులో రెండవ నిందితుడు తమిళనాడుకు చెందిన జీజే శ్రీనివాసులు పరారీలో ఉండగా ట్రాన్సిట్ వారెంట్‌తో విజయనగరం తీసుకువచ్చి జడ్జి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నూకరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పీఎస్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని నటరాజ్‌కాలనీకి చెందిన నూకరాజు(41) దుర్మరణం చెందాడు. నూకరాజు ఇంటి నుంచి బైక్‌పై ధర్మపురి వెళ్లాడు. తిరిగొస్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో నూకరాజు కింద పడిపోగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై అశోక్ తెలిపారు.

బియ్యం దొంగలకు భరోసా..!

• వారి జోలికి వెళ్లొద్దని అధికారులకు కూటమి నేతల హుకుం
• అధికారులు మౌనం దాల్చారని విమర్శలు



కొండ కిండాం కోళ్ల ఫారంలో నార సంచుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: బొండపల్లి మండలంలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం పట్టివేత సంఘటన జరిగి 24 రోజులవుతున్నా చర్యలు శూన్యం. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించిన దొంగలకు కూటమి నేతలు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించిన వారి జోలికి వెళ్లొద్దని కూటమికి చెందిన నేతలు సంబంధిత శాఖ అధికారులకు హుకుం జారీ చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుచేతనే అధికారులు మిన్నకుండిపోయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారం చేపట్టిన తొలినాళ్లలో కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. కానీ ఇప్పుడు పీడీఎస్ బియ్యం నేరుగా నారసంచులతోనే దొరికినప్పటికీ కిమ్మనకపోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రేషన్ వాహనాల ద్వారా పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతోందనే డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేపట్టామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేపట్టిన మొదటి నెల ఆరంభంలోనే నార సంచులతో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించారు. ఇది పెద్ద ఎత్తున సంచలనమైంది.

బొండపల్లి మండలంలో పట్టుబడిన బియ్యం

పేదప్రజలకు అందించే పీడీఎస్ బియ్యం కొంత మంది వ్యాపారులు పెద్ద ఎత్తున పక్కదారి పట్టించారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. బొండపల్లి మండలంలోని కొండకిండాంలో గల కోళ్ల ఫారంలో 106 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, కిండాం అగ్రహారం మామిడి తోటలో 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అధికారులు గుర్తించారు. రేషన్ దుకాణాల్లో ఉండాల్సిన పీడీఎస్ బియ్యం కోళ్ల ఫారం, మామిడితోటల్లోకి తరలించడం సంచలనమైంది. అయితే ఈ సంఘటన జరిగి 24 రోజులవుతున్నా వ్యాపారులు ఏ రేషన్ షాపు నుంచి తరలించారనేది అధికారులు ఇంతవరకు తేలల్చలేదు. ఎంతసేపు 6 ఎ కేసులు నమోదు చేశామని చెప్పడం తప్ప. వ్యాపారులకు సహకరించిన రేషన్ డీలర్ ఎవరనే వివరాలు అధికారులు వెల్లడించలేదు. అయితే పీడీఎస్ బియ్యం ఏ రేషన్ షాపు నుంచి వెళ్లాయన్న విషయం సివిల్ సప్‌లైస్ అధికారులకు తెలిసినప్పటికీ కూతమి నేతలు బయటకు చెప్పవద్దని ఆదేశించారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బయటకు చెప్పడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సంఘటన జరిగి ఇన్ని రోజులైనా సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి లేని పాలన అందిస్తామని కూటమి నేతలు గొప్పలు చెబుతున్నారు. కానీ పీడీఎస్ బియ్యం తరలింపు ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా నోరు మెదపడం లేదు.

వ్యాపారులపై కోర్టులో కేసులు

పీడీఎస్ బియ్యం తరలించిన వ్యాపారులపై కోర్టులో కేసులు పెడతాం. బియ్యం తరలించిన రేషన్ డీలర్ల వివరాలు కూడా తెలిశాయి. వారిపై నిఘా పెట్టాం. వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

– కె.మధుసూదన్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

గిరిజన రైతు విలవిల..!

• అన్నదాత సుఖీభవ కోసం నిరీక్షణ
• ఖరీఫ్‌లో తప్పని ఆర్థిక వెతలు



పొలం దున్నుతున్న రైతు

సీతంపేట: ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. పంటలు పండించడానికి పెట్టుబడులు ఎలా అని రైతులు గిరిజన ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఈపాటికే పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. కూటమి ప్రభుత్వం ఇదిగో..అన్నదాత సుఖీభవ..అదిగో..అంటూ కాలం వెళ్లబుచ్చుతోంది తప్ప ప్రయోజనం లేకపోయిందని రైతులు పెదవి విరుస్తున్నారు. పోడు వ్యవసాయంలో పండించే పైనాపిల్, పసుపు, కొండచీపుళ్లు ఇతర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు దరలు లేవు. ఈ పంటల ద్వారా ఆదాయాలు వస్తే కొంతమేర ఖరీఫ్ వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టుకోవడానికి వీలుండేది. వాటికి కూడా సరైన మద్దతు ధరలు లేకపోవడంతో పంటలు ఎలా పండించుకోవాలో తెలియని పరిస్థితి ఉందని గిరిజన రైతులు వాపోతున్నారు. అన్ని విధాలా నష్టపోతున్న తమను ఆదుకునే దిక్కులేదని ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో వరి, రాగులు, కంది, ఇతర కొండ పోడు పంటలన్నీ వేసుకోవడానికి సరైన సమయం. తగిన పెట్టుబడి సాయం లేకపోవడంతో గిరిజన రైతులు డీలా పడుతున్నారు.

16,800 మంది రైతుల ఎదురుచూపు


సీతంపేట ఐటీడీఏ పరిధిలో 16,800 మంది కొండ పోడు పట్టాలు కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు. వైఎస్సార్‌సీపీ హయాంలో 25 వేల ఎకరాల్లో సాగు భూమిపై పూర్తిహక్కులు కల్పించి, సుమారు 17 వేల మందికి పట్టాలు ఇచ్చి రైతు భరోసా నిధులు రూ.13.500లు చొప్పున జమచేశారు. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500లు కలిపి మొత్తం రూ.13,500ల మొత్తాన్ని రైతు ఖాతాల్లో జమచేశారు. ఇప్పటి ప్రభుత్వంలో ఖరీఫ్ పనులు ప్రారంభమైనప్పటికీ ఇంతవరకూ ఎటువంటి సాయం లేదు. గతేడాది కూడా ఒక్కపైసా ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు పెద్దమొత్తంలో నిధులు అవసరమవుతాయి. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీబవ ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైనా ఆర్థిక సాయం ఇంతవరకు అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

త్వరలో నిధుల జమ

త్వరలో అన్నదాత సుఖీభవ నిధులు అర్హులందరికీ జమ అవుతాయి. ఈ మేరకు విధివిదానాలు రూపొందాయి. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వ్యవసాయ పంటల సాగుకు వినియోగించాలి.

– ఎన్వీ గణేష్, పీఏవో, సీతంపేట ఐటీడీఏ

గతంలో ఖరీఫ్‌లో రైతు భరోసా వచ్చేది



గతంలో ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతుల ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. ఏడాదిగా ఎదురు చూపులే మిగిలాయి తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు. ఆ సొమ్ముతో పెట్టుబడి పెట్టి పంటలు పండించే వాళ్లం.

– ఎస్.అబ్బాస్, రైతు, కుశిమి

'మధ్యతరగతి మందహాసం' పుస్తకావిష్కరణ



మధ్యతరగతి మందహాసం పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: బెహరా వెంకట సుబ్బారావు సర్వ లభ్యరచనల పుస్తకం 'మధ్యతరగతి మందహాసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశమందిరంలో ఆదివారం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి కలిగొట్ల సన్యాసిరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బహుభాషా గ్రంథకర్త డాక్టర్ వీవీవీ.రమణ మధ్యతరగతి గాథలు, వ్యథలను స్వయంగా పరిశీలించి, అనుభవించి రాసిన గొప్ప రచయిత బెహరా సుబ్బారావు అని ప్రశంసించారు. మన జీవితాల్లో జరుగుతున్న అనేక సంఘటనల సమాహారం మధ్యతరగి మందహాసమని విశిష్ట అతిథి, వ్యంగ్య కథల రచయిత డాక్టర్ కొచ్చర్లకోట జగదీష్ పేర్కొన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ కేఎస్ఎస్ బాపూజీ కథలపై సమీక్ష చేస్తూ సునిశతమైన హాస్యాన్ని కథలలో జోడిస్తూ తాను చెప్పాల్సిన విషయాన్ని సున్నితంగా చెబుతూ ప్రతి కథకు గొప్ప కొసమెరుపులిచ్చారన్నారు. పుస్తక సంపాదకుడి సుబ్బారావు కుమారుడు మూర్తి మాట్లాడుతూ నాన్నగారి కథలు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యానికి దోహదపడ్డాయన్నారు. సుబ్బారావు కథలు మధ్యతరగతి మహాభారతమని, అటువంటి గొప్ప కథల పుస్తకాన్ని సుబ్బారావు పుత్రుడు మూర్తి పెద్ద గ్రంథంగా తీసుకురావడం తండ్రిరుణం తీర్చుకున్న కుమారుడిగా ధన్యుడయ్యాడని అరసం జిల్లా అధ్యక్ష్యుడు జీఎస్.చలం పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత రాజోలు నుంచి హాజరైన ఎం.ఎస్.సూర్యనారాయణ కథల మీద సమగ్రమైన విమర్శ రావాలని, ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.